అబల

శ్రీ వేలూరి సహజానందం

అది కేవలం ఒక విచిత్రమైన ఆలోచనే కాదు. అత్యంత ఘోరమైన ఆలోచన. ఆ అశనిఘాతానికి ఆమె క్షణంసేపు విపరీత భయంతో ఇంచుమించు కొయ్యబారింది. మానసిక వీథిలో ఆ ఆలోచన రేపిన గాలిదుమారం నల్దిక్కులా కమ్మివేసింది.

నిశిరేయి హంతకుని పదధ్వనిలా ఆ ఆలోచన నరనరాల్లో ప్రతిధ్వనిస్తోంది.

దారుణం!

ఈక్షణంలో, ఈ ఒక్క క్షణంలో ఆకసమంతా ఎలా చీకటి తరంగాలతో హోరెత్తింది! మిణుకుమనే నక్షత్రం ఒక్కటి కూడా కనపడ్డంలేదు.

వందల మైళ్ళ దూరంలో లేడు భర్త. కీకారణ్యంలో చిక్కుకుపోయి లేడు. వ్యాధిగ్రస్తుడై వైద్యులకు, మృత్యుదూతలకు మధ్య దోబూచులాడటం లేదు. ఎదురుగా కుర్చీలో కూర్చొని ఏదో పుస్తకం చదువుతున్నాడు.

అవును. కాని తన ఎడదలో పిడుగుపాటులా పడిన ఆలోచన అతనికి తెలియదు. అతని ధ్యాస భగ్నం కాకుండానే ఉన్నది. చదువుకుపోతూనే ఉన్నాడు.

ఏ మహాభయంకరచ్ఛాయను చూసి తాను జడుసుకుందో, ఆ ఛాయ అతనిపై సోకినట్లే లేదు. ఎంత అమాయకుడు! ఎంత నిర్భీతి! మెడ చుట్టూ ఉచ్చు బిగిస్తున్నా కదలక మెదలక కూర్చున్నాడు.

అతనికేసి తేఱిపార చూసింది.

జీవించే ఉన్నాడు.

కాని తనకు దౌర్భాగ్యపు ఆలోచన ఎలా తట్టింది? ఉన్నట్టుఉండి మనస్సుకు ఈ దారుణ స్ఫురణ ఎలా కలిగింది తన భర్త చనిపోయినట్టు! హఠాత్తుగా ఎవ్వరో వచ్చి తనకు ఆ మరణవార్త విన్పించినట్టు...ఒక్కసారి ప్రపంచమంతా చిమ్మచీకట్లు కమ్మినట్టు అయింది.

తన ఊహ ఎంత భయంకరమైనదైనా, అది కేవలం అయథార్థం. అయినప్పటికీ ఆమె ముఖంలో దాని ముద్ర ఇంకా చెఱగిపోలేదు. అయథార్థం గదా అన్న నిబ్బరం ఆమె మనస్సుకింకా నిలకడ నివ్వలేదు. అయథార్థం అనేది బహుశః ప్రస్తుతానికి మటుకే! అంతే! ఇప్పటిది కేవలం ఊహే కావచ్చును. కాని ఎప్పటికైనా నిరోధించలేని నిజమే కదా అది? పాపం! భర్తకూ మృత్యువుకూ మధ్య తానెన్నాళ్ళు అడ్డంగా నిలిచి ఉంటగలదు? ఎన్నాళ్ళు, ఎన్నేళ్ళు అని గుమ్మంలో కూర్చొని, మృత్యువును రానీయకుండా కాపలా కాస్తుంది? అయినా మృత్యువుకు రెండు మార్గాలు. ఒకటి శరీరావస్థ. రెండవది హఠాత్ ప్రమాదం. ఈ రెండు పాశాల్లో ఏ ఒకటో తప్పదు ప్రతివాడికి.

అతనింకా చదువుకు పోతూనే ఉన్నాడు. చీమ కుట్టినట్టుకూడా లేదు. తనుమటుకు ఉక్కిరిబిక్కిరి అవుతోంది. మృత్యువు వెంట భర్త నడిచాక, తన గతి ఏంకాను? ఈ క్రూరప్రశ్నే ప్రచ్ఛన్నంగా తన నిప్పుకు ఇంతవరకు క్షోభ పెట్టింది.

తన గతి ఏంకాను?

ఇన్నాళ్ళలో ఎప్పుడూ తనకు 'తన గతి' గురించి అసలు ఏమీ పట్టనేలేదు. ప్రవాహంలో హాయిగా సాగిపోతున్న పడవ హఠాత్తుగా ఏ రాతి బండలకో కొట్టుకొని, మునిగిపోవచ్చుననీ, అప్పుడా సుడిగుండాల్లోంచి తనెలా ఒడ్డుకు ఈదుకురావటం అని ఆమె కింతవఱకు ఎప్పుడూ ప్రశ్న కలగలేదు.

"తనగతి?"

ఏమిటాగతి?

అదంతా పూర్తిగా అయోమయం. భర్త ఉన్నంతకాలం తనగతి ఏమిటి? ఆ ప్రశ్నకు అసలు అర్థం ఉందో లేదో ఆమెకు తెలియదు. కాని భర్త కనులుమూశాక తనగతి ఏమిటి? ఈ ప్రశ్నకు అసలు అర్థం స్పష్టంగా గోచరించినా, గోచరించక

పోయినా, దాని ప్రతిధ్వనిమటుకు అత్యంత భయంకరంగా ఉంది.

"తనగతి" ఏమిటి?

ఈ ప్రశ్న ఈ ప్రచండమైన ఊహవల్లనే కలిగింది ఇప్పుడు. ఇంతవఱకు ఆ స్పృహ లేదు. భర్తతోపాటు జీవిస్తూ ఉండటమే తప్ప, వేఱే 'గతి' ఒకటి ఉంటుందనిగాని, ఉండాలనిగాని ఆమె ఎప్పుడూ అనుకోలేదు. అనుకోవలసిన అవసరమూ కన్పించలేదు. సంప్రదాయమూ లేదు.

ముత్తవతల్లి ఎప్పుడూ అనేది. "అమ్మాయి! పసుపు కుంకుమతో చనిపోయే అదృష్టం నాకు లేకపోయింది" అని. నిజానికి మృత్యువు ఈ కాస్త ఉపకారం స్త్రీకి చేస్తే, అసలు వేఱే భయంకర ఊహలకు, దైన్యానికి తావుండదు. ఈ మాత్రపు కనికరం మృత్యువుకు ఉంటే, తన ముత్తవతల్లి అలా ప్రతిక్షణం కుమిలిపోతూ ఉండేదికాదు. తనూ ఇలా ఈ హఠాత్తు ఆలోచనతో కంపించిపోయేదికాదు. వేలాది స్త్రీల వేదనలు చెవిలో గింగురుమంటున్నా, మృత్యువు మటుకు ఈ కొద్దిపాటి వరాన్ని ప్రసాదించటంలేదు. సత్యవంతుడిమీదికి పాశం విసరేముందు, సావిత్రి కనులను తన శీతలహస్తాలతో మూస్తే చాలు మృత్యువు. ఇంతకన్న స్త్రీ జాతికి వేఱే ఏ కోరిక అక్కరలేదు. కాని మృత్యువు అందు కొప్పుకోదు.

వసంతంలో పుష్పలత తానిప్పుడు. కాని భర్త అనంతరం శిశిరంలో ఆకులు రాలిన మోడు! లోకపు గౌరవాదరాలు తనను సత్కరించవు. ఇక ఉపాధి! కేవలం నిర్ధనికులు కాదు కాబట్టి ఆకలిసమస్య లేదు. అసలు చాలామంది భర్తమృతి తర్వాత జీవికకోసమే పడుతున్న అగచాట్లు దుర్భరం! ఆ నరకయాతన తనకు లేదు. కాని అది లేదన్నంతమాత్రానే లోటు పూర్తికాలేదు. ఉపాధికి లోటు లేకపోయినా, ఆ అనంతర జీవితమంతా అయోమయంగా, సుదీర్ఘ నిశీథంలా వుంది. ఏమిటా అయోమయం! ఏమిటా సుదీర్ఘ నిశీథం! చెఱిగిపోయిన భర్త పదచిహ్నాంలోంచి కనపడే ఆ అగాధమైన లోటులోయ ఏమిటి? గుండెను భగ్గుభగ్గున మండించే ఆ జ్వాల ఏమిటి?

భర్త! అయిదేళ్ళక్రితం అతను పూర్తిగా అపరిచితుడు. ఎట్టి చుట్టరికం కూడా లేదు. ఈ హఠాత్తు ఊహ నిజమే అయితే తదనంతరం అతను మళ్ళీ అపరిచితుడుగానే ఉండిపోతాడు. ఈ అయిదేళ్ళ సహ-జీవితం ఎంత పరవశ మాధుర్యం సేకరించిపెట్టిందో, మళ్ళీ అంత దుఃఖాన్ని, బహుశః అంతకుమించిన దుఃఖాన్ని కూడబెట్టుతోంది. ఈ మాధుర్యానికీ, ఆ దుఃఖానికి కారణభూతమైనదేమిటి? కేవల పురుష సాంగత్యమా? లేక మరేమిటి?

తన కొద్దిపాటి చదువుతో కొన్ని పుస్తకాలు చదివింది. పునర్వివాహం, దాని ఆవశ్యకత గురించి తనకు తెలుసు. కాని కేవలం పునర్వివాహం వల్లనే ఈ అయోమయం, అగాధం తొలగిపోతవా? లేక అమావాస్యను మరొక పక్షంవరకూ వాయిదా వేయటమేనా?

పునర్వివాహం? వివాహం?

పీల్చే గాలిగురించి ఏమీ ఆలోచన ఎలా కలగదో, వీటిని గురించీ అంతే. మానసికంగా, అభిప్రాయ రంగంలో సంస్కార ధ్వజంతో పునర్వివాహం అనే భావం జయించినా, నిజానికి ఆదారి తొక్కినవారు బహు కొద్దిమంది. గ్రామాల్లో అసలే లేరనవచ్చును. పునర్వివాహం పునః పురుష సాంగత్యాన్ని చేకూర్చినా, బహుశః ఆ అంతర విషాదాన్ని ఓదార్చలేదేమో. అందుకేనేమో, సమ్మతమైనా ఎవరూ మళ్ళీ మంగళసూత్రాన్ని ముట్టటానికి మోజుపడటంలేదు. మళ్ళీ ధర్మపత్నిగా సంధ్యదీపం వెలిగించవచ్చు. కాని ఆ లోనిచీకటి అలానే గుండెను కుంగదీస్తూ ఉంటుంది. తుపానులో ఇల్లు శిథిలంకాగా, కొత్త ఇంట్లో ప్రవేశించినా, ఆ ఖామందు కిటికీవద్ద కూర్చొని అదృశ్య శిథిలగృహం గురించి తలపోసే విధంగానే, కొత్త బాహువులమధ్య పాత పుస్తకాన్నే తిరగవేస్తూ ఉంటుంది మనస్సు. బహుశః అది ప్రథమ పరిచయపు మహిమ ఏమో? ప్రథమ పరిచయ మాధుర్యం తదనంతర పరిచయాలలో ఉండదేమో! మరొక పరిచయంలో తన పవిత్ర నగ్నత ప్రదర్శితమైనట్టు ఉంటుంది. అంతర్యమంతా ఆచ్ఛాదన తొలగి నగ్నమై, మూడవకంటికి కనపడిపోతుంది. ఆ లజ్జాభరం దుర్భరంగానే ఉంటుంది. ప్రథమ పరిచయంలోని ఆవేశ తీవ్రత విలీనవేగం, తన్మయత సహజంగా, స్వాభావికంగా సిద్ధిస్తయ్. తర్వాత...తర్వాత...పమిట తొలగిన పడతి తడబాటులా ఉంటుంది.

తన స్నేహితురాలుంది. దురదృష్టవంతురాలు. భర్త మూఢుడు. పశువు. దెబ్బలతో కన్నుమూయని రేయి ఉండదు. ఆమెకు ప్రథమ పరిచయం విష-

పాత్ర అయింది. జీవితమంతా ఆమెకు చేదుగానే తోస్తుంది. బహుశః అలాంటి అభాగినులకు మరొక పరిచయం ముక్తిదాయకం కావచ్చు—వారి ఎడదలో తేనె ఇంకిపోకుండా ఉంటేను. కాని తనలాంటి సుభాగినులకు కొత్త దిక్కులకేసి చూడవలసిన అవసరంలేదు. తన ఆకాశంలో ఎప్పుడూ విషాదమేఘం వేలంతకూడా ఆవరించలేదు. భర్త సాహచర్యం తనకెప్పుడూ వేదనను కల్గించలేదు. భర్తలు మూఢులు, పశువులు కాకపోయినా, హృదయస్పందాన్ని ఎరుగని బధిరులుగా ఉన్నవారూ ఉన్నారు. వారి భార్యలు ప్రియుల పరిచయంకై పరితపించవచ్చు. తనకలాంటి బధిర భర్త ప్రాప్తించలేదు. తనకు తీగె వేఱు, కుసుమం వేఱుకాదు. తన పందిరిపై పెనవేసుకొని, అల్లుకున్నది సుపరిమళ సుమభరితమైన సన్నజాజి.

ఆ ఘోరసంఘటనానంతరం ఆ అగాధ అయోమయాన్ని ఏ పరచ్ఛాయ నింపివేయలేదు. మరెలా తను బతికేది? ఒహ్! తనగతి ఏంకాను?

అదే! అవును...తనగతి?

తనగతి?

ఏమిటది?

తన జీవితం ఎంత డొలుగా ఓటిగా ఉంది? ఎందుకని జీవించటం? ఎందుకని మరణించకుండా ఉండాలి? ఊహు...ఈ చైతన్యం తనలో ఇంత వఱకూ మేల్కొనలేదు. మేల్కొన్నాక ఊపిరి సలపనివ్వటంలేదు. తనూ, భర్త ఎన్నెన్ని విషయాల గురించో తర్కించారుగాని, ఈ తులసికోటచుట్టూ ఎప్పుడూ ప్రదక్షిణం చేయలేదు. జీవించిఉండగానే భర్తనుంచి ఈ రహస్యం, తెలుసుకోవాలి. తన గతి రూపురేఖ లనేవి ఏమిటో అతని వెలుగుండగానే చూసుకోవాలి. అతనికీ తెలుసునో లేదో? తెలిసి ఉంటే ఎప్పుడైనా మాటవరసకైనా ఆ ఊసు ఎత్తేవాడు.

వెనకనుంచి దీర్ఘమైన,ఉద్రిక్త నిశ్వాసం వినబడి అతను వెనక్కు చూశాడు. కుర్చీలోంచి తొట్రుపాటుగా లేచివచ్చి, నుంచొనిఉన్న ఆమె కళ్ళలోకి చూశాడు. తుపానుగాలి కక్కడ తెఱచాప చినిగి చినిగి చీలికలు పేలికలు అయిపోతోంది. అక్కడ ఇంటి నడికప్పుకు నిప్పు అంటుకుంది.

భయసంభ్రమాలతో అతను ఆమెను తన ప్రేమ భరిత హృదయానికి గట్టిగా హత్తుకున్నాడు—ఉయ్యాలలో ఉలిక్కిపడిన పసిశిశువును తల్లి వక్షస్సుకు అదుముకున్నట్టు. కాని ఉండేలుదెబ్బ తిన్న పిట్టవలె ఆమె గుండె ఎందుకు కొట్టుకుంటోందో అతనికి తెలియదు.

“దేని కంత భయం?” అని కంపిత స్వరంతో అడిగాడు. ఆమె కళ్ళలోకి చూశాడు. ఆమె నిశ్వాసాల్లోంచి జవాబేమీ వినబడలేదు.

తన బాహువుల మధ్యకూడా ఆమె ఇంకా అల్లల్లాడుతూనే ఉంది. కాని క్రమంగా అతని శరీరం ఇచ్చే అభయంతో ఆమె భయం తీరిపోయింది!

క్షణకాలంలో ఆమె పెదవులపై చిన్ని చిరునవ్వు మొలకెత్తింది. భయ ఝంఝామారుతాల మధ్య నిశ్చలంగా వెలిగే ప్రేమజ్యోతి ఆమె కళ్ళలో నిశ్చల దీపకళికలా మెరిసింది. ఆ ఆనంద తన్మయత ఆమె కొక దివ్యానుభూతిగా భాసించింది!